# మిత్రుడు "నాగ్ – భూషణ్"

– డా॥ సి. నారాయణరెడ్డి

చిరకాలమిత్రుడు ఆచార్య నాగభూషణశర్మ. 1955లో గుడివాడ కాలేజీలో ఉపన్యాసం, కావ్యగానాలు చేయడానికి వెళ్లాం నేను, దాశరథి. అక్కడ మిత్రుడు రామకోటిశాస్త్రి లెక్చరర్‌గా ఉండేవాడు. శర్మని పరిచయం చేశాడు. "ఇతని నాటికలు, నాటకాలు భారతిలో వచ్చాయి, మీరు చూసివుంటారు." అన్నాడు శాస్త్రిగారు. వస్తూనే రైల్లో చదివా అతని "విషాదాంతం". ఆ నెల భారతిలో వచ్చింది. ఆ 'నాగ్‌భూషణ్' ఇతనేనా? అవునన్నాడు శాస్త్రిగారు. అమాంతం కావలించుకొని "నాగ్ – మాకెవ్వరికీ భారతిలో నెలవిడిచి నెల ప్రచురించే అవకాశమే లేదు" అన్నాడు దాశరథి. అలా జరిగింది మా పరిచయం. అప్పటినుంచీ అతడు నాకు "నాగ్". ఇప్పటికీ అంతే!

ఇప్పుడు నాటకాచార్యుడు. మనవాళ్లు సంస్కృత నాటకాల్లో ఆచార్యుడికి చాలా లక్షణాలు చెప్పారు. అన్నీ నిండుగా ఉన్నవాడు నాగ్.

అన్నిటికన్నా యివ్వాళ యీ ఆత్రేయ పురస్కారం అందుకోవడానికి అతన్ని మించినవాడు ఆంధ్రదేశంలో ఉన్నాడనుకోను. కేవలం ఆత్రేయ మాకిద్దరికీ మిత్రుడని చెప్పడం కాదు. శర్మ "ఆత్రేయ నాటకోత్సవాల"ని తన డిపార్ట్‌మెంట్ తరఫున ఆరురోజుల పాటు ఆత్రేయ నాటకాలను ప్రదర్శించేలా చేయడం, ఆయనమీద సెమినార్ పెట్టడం, ఆయనమీద ఇంగ్లీషులోను, తెలుగులోను పుస్తకాలు ప్రచురించడం – ఇంత పెద్ద కార్యక్రమం ఒక్క చేతిమీదుగా నిర్వహించాడు. అప్పటివరకు ఆంధ్రదేశంలో ఒక సజీవుడైవున్న నాటకకర్త మీద యింత విస్తృతమైన చర్చ జరగడం, దానికి ఆలంబనగా సాయంకాలాలు ఆయన నాటికలను, నాటకాలను ప్రదర్శించడం జరిగిందని నేననుకోను. చాలా క్రమబద్ధంగా చేశాడు. నేను రెండు సభలకి – ప్రారంభసభ, ముగింపుసభలకి అధ్యక్షుడిని. మొహమాటపెట్టేశాడు. "రాకతప్పదు అన్నా!" అన్నాడు.

అంతకన్నా మరో కారణం వుంది. ఆత్రేయ నాటకోత్సవాలలో ఆఖరురోజు "విశ్వశాంతి" నాటకం శర్మ దర్శకత్వంలో పిల్లలు ప్రదర్శించారు. ఏం ప్రదర్శన! ఆత్రేయ పొంగిపోయాడు! నాటకం పూర్తయ్యిందో లేదో స్టేజిమీదకు పోయి ప్రశంసలవర్షం కురిపించాడు.

ఆత్రేయ ఆయన యింట్లోకి వచ్చిన 'సరికొత్త మామగారు'. ఎక్కడ ఏ 'ఫైవ్‌స్టార్ హోటల్' లో దిగినా అక్కడ సామాన్లు పడేసి శర్మగారింటికి వచ్చేవాడు. 'అమ్మాయి – సరస్వతి – ఇవ్వాళ యిది చెయ్యి, అది చెయ్యి' అని అడిగేవాడు. 'అలాగే బాబాయిగారూ అనేది' – మా సరస్వతి. ఆమె నా స్టూడెంట్. చదువుకొనేటప్పుడూ అంతే వినయం.

ఈ సంవత్సరం ఆత్రేయ పురస్కారానికి నాగభూషణశర్మను ఎంచుకున్నందుకు భవానిని అభినందిస్తున్నాను. పుచ్చుకోవడానికి ఒప్పుకున్న నాగ్‌కీ అభినందనలు.